★ దుర్గమ దుర్గాలు ★

రచన శ్రీ బి. విశ్వేశ్వరరావు బి.ఎస్ సి

శాంత పెండ్లి విషయం విషమసమస్యై కూర్చున్నది శివరామదాసుకు ఆఫీసులో కూర్చుని నాల్గు పంక్తులు వ్రాసేటప్పటికి అనుకోకుండా కలం నిలబడిపోయేది అతని తలలో ప్రకృతి విలయ తాండవం చేసేది పనిలో అశ్రద్ధయిపోవుటచే అధికారుల దావానలం చెలరేగింది పట్టభద్రుడైనా గుమాస్తాగా కృశించిపోతున్నాడు తానో యింత చదువుకున్నవాడు, అందుచే శాంతని ఏపట్టభద్రుని చేతుల్లోనో పెట్టాలనివుంది కట్నాలియ్యకపోతే కళ్యాణం కాదాయె !

ఆవేళ ఆదివారమగుటచే శివరాందాసు ఇంట్లోకూర్చొని ఆఫీసు కాగితాలు చూచుకుంటున్నాడు ఇంటికి యెదురుగుండా ఆవీధిలోని అమ్మలక్కలు సమావేశం అయిలేని సమస్యలను వితర్కిస్తున్నారు కమలమ్మ, శాంత తల్లి వీధిలోనికి తుక్కు పారబొయ్యడానికి వచ్చేసరికల్లా సభ ప్రెసిడెంటు సుబ్బమ్మ "ఏమండోయి కమలమ్మగారు-రండీ" అంది కథ కోసం "ఇంట్లో పని వుంది" అంది కమలమ్మ ఆమెకి కమిటీలు అంటే రుచిలేదు

"ఏమిషే, మాకు ఖూరెముక్క లెప్పుడు పెట్తావ్-నోరు తెరుచుకొని కూర్చున్నాం?" అంది వెంకమ్మ పెద్దరికం చేస్తూ.

"మీపెద్దల ఆశీర్వాదం యెప్పుడు ఫలిస్తే అప్పుడు" అంది కమలమ్మ

"అదేమిషే! మన తాహత మంది కాని పెద్ద పరుగులికి పోతే అలసిపోముషే- మొన్న సుబ్బారావు పెద్ద కొడుకు సుదర్శనం కిస్తామన్నారుటగా? ఆఁ! వాళ్ళెక్కడవారు M Sc చదువుతున్నాడు ఏ మూడ్నాల్గువేలో లాగుతాడు— మనం తూగగలముషే" అంది వెంకమ్మ కథ పెంచడానికి

కమలమ్మ మౌనం వెంకమ్మ యెత్తుకుంది "నా మొగుడు బి ఏ ప్యాసయ్యాడని — నీ బొట్టెక్కడా రమ్మంటే వస్తాడా బి ఏ గాడు - ఏం సత్యకాలమే!"

కమలమ్మ కప్పుడే గుడ్లలో నీరుతిరిగింది శాంత పిలవగానే లోనికి వెళ్ళిపోయింది చావిట్లోకి వచ్చి పయిట కొంగుతో కన్నీరు తుడుచుకొంది కమలమ్మ

అమ్మలక్కలకి అంశం దొరికింది విమర్శనలకి—

"అంతకంతకి అలా పెరిగిపోతున్నది పిల్ల— మాపిల్లలందరికి పెద్దవాళ్ళవకుండానే ముడిపెట్టేశాము. ఇదేంటమ్మా. యిలాంటిదెప్పుడూ చూడలేదు కాని తాహతుకు పోవడం" అని అంది రెండుచేతులతో దోచే గూడ్సు క్లార్కు భార్యామణి

శివరాందాసు చెవుల్లో ఇవన్నీ పడ్తున్నాయి అతని ఆలోచనలు ముందుకు సాగుతున్నాయి కాని అతని కలం నడవడంలేదు. ఒక్క నిట్టూర్పు విడిచాడు!

"ఏ పుల్లయ్యకో-గిల్లయ్యకో యిచ్చేయాలి కానీ ఏమిటీ వెర్రివేషాలు- ఇంట్లో కుండలు డింకీ కొడుతున్నాయి! వుట్టికి యెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందట! ఇదంతా ఆయనగారి ప్రతాపమే!" అంది యిచ్చకాల బుచ్చమ్మ

శివరాందాసు మరి ఆమాటలు వినలేక పోయేడు చెవులు రెండూ గట్టిగా మూసుకొన్నాడు. అతని హృదయాన్ని కణ కణ కాల్చిన సూలాల్తో పొడిచినట్లయింది కాగితాల దగ్గర నుండి కదిలి మంచంమీద పడుకున్నాడు చేతులు తలమీద పెట్టుకొని ఇంతలో శాంత గదిలోకి వచ్చి "నాన్నా, అమ్మ కాఫీకి రమ్మంది" అని అంది అతను పల్కలేదు తండ్రి ముఖంలోకి చూసింది అతని చెక్కిళ్ళపై కన్నీటి చుక్కలు నిలచి ఉన్నాయి విచారంతో "నాన్నా! నాన్నా!" అని పిలచింది శాంత. అతను కళ్ళు విప్పి చూశాడు కాగితాలన్నీ యెగిరి గదిలో చిందరవందరగా పడున్నాయి

"నాన్నా కాఫీకి"

"ఇవాళనుండి కాఫీ పెట్టవద్దన్నానుకదమ్మా"

"నీకొక్కరికే నాన్నా--నీకు పనిజాస్తీ"

"నాకూ వద్దు"

ఇంతలో కమలమ్మ భర్తకి కాఫీ పట్టుకొని రానే వచ్చింది శాంత పయికి పోయి 'ఆంధ్ర మహిళ' తీసి చదువబోయింది అమ్మా, నాన్నా తన పెళ్ళి విషయం మాట్లాడుతున్నారు వారిలో నిరుత్సాహము— అశక్తి సుగోచరమగుతున్నాయి. శాంత వారి మాటలు విని ఆలోచించింది తన స్నేహితురాలు దగ్గరనుండి తెచ్చిన "ఆంధ్ర మహిళ" తిరగేసింది దానిలో "స్త్రీ విద్య— వరకట్నాలు" అనే వ్యాసాలు పదేపదే చదివింది నిరుత్సాహాన్ని పారదోలి- ధైర్యంతో తానాలోచించిన పథంలో ముందంజ వేయదలచింది విమల దగ్గరకెళ్ళింది ఆమె S S L C ప్యాసయింది ఆమె దగ్గర ఎ-బి-సీ డీలు మొదలు పెట్టింది రెండవ ఫారం చదువుతున్న చిన్న తమ్ముడు- ఐదవ ఫారం చదువుతున్న 'పెద్ద తమ్ముని సహాయంతో విద్య నేర్వడానికి కంకణం కట్టింది

శాంత నిద్రాహారాలు మాని చదువులో కృషిచేస్తున్నది. ఏడాది గడిచింది రెండో యేడు మెట్రిక్యులేషన్‌కు కూర్చొని ఉత్తీర్ణురాలైంది ప్రతీ సబ్జెట్టులోను 60, 70 మార్కులు వచ్చాయి విమల తండ్రి కాలేజి లెక్చరర్ శాంతని యింటరు చదవమన్నాడు తాను స్కాలర్‌షిప్ ఇప్పిస్తానన్నాడు శాంత తండ్రి దాని కంగీకరించాడు శాంత కాలేజీలో చేరింది కాలేజీ వాతావరణం ఆమెకు కొత్తగా యుండటమువల్ల కొంత బాధ అనిపించిందామెకు కాని రాను రాను దాని కలవాటు పడిపోయింది

నళినీకాంత్ బి యస్ సి విద్యార్థి, కాలేజీ మెట్లు దిగుతున్నాడు శాంత తొందరగా మెట్లెక్కబోయి జారి పడింది నళినీకాంత్ ఆమెను లేవనెత్తి, పడిన పుస్తకమ్ము చేతికిచ్చాడు. శాంత "థేంక్సు" అంది కంగారుగా నళినీకాంత్‌ను కాలేజీ యందరికీ తెలుసు అతను సజ్జనుడు- సరస్వతీదేవి ముద్దు బిడ్డకు— కాలేజీలోని ప్రథమ బహుమానాలన్నీ అతనివే!

"దెబ్బ తగలలేదు గదా" అన్నాడు,

"లేదు- థేంక్సు" అంది శాంత సిగ్గుతో

వారి నేత్రాలు మధుర భావాలతో కలిసాయి సహజముగా శాంత అందమయినది శ్వేతవర్ణి ఆ సువిశాల కాటుక కళ్ళకి మానవులను మైమరపించే గుణం వుంది

కాలేజీ యూనియన్ ఎలక్షన్సు వచ్చాయి నళినీకాంత్ తరపున ప్రెసిడెంటు పదవికై ప్రచారం చేసింది శాంత నళిని ప్రెసిడెంటు అయాడు శాంత గర్ల్సు రిప్రజెంటేటివు అయింది శాంతా నళినీకాంతుల హృదయాల్లో తెలియని ప్రేమబంధమేదో యేర్పడింది.

ఆనాడు కాలేజీలో సందడిగాయుంది కొత్తలెక్చరర్ వచ్చాడు. శాంత లేబరేటరీలోనికి వెళ్ళింది గంటకొట్టారు సూటులో కొత్తలెక్చరర్ ప్రత్యక్షమయాడు శాంత నిర్ఘాంతపోయింది ఆమె గుండె దడదడ కొట్టుకుంది "అతను ! అతను ! సుబ్బారావుగారి కొడుకు — సుదర్శన్ ఎమ్ ఎస్ సి !— కట్నాల పేరాశతో అందాల రాశిని తన్ను పెండ్లికి తృణీకరించాడు !"— కాని సుదర్శన్ శాంతను పోల్చలేదు. అతను శాంత కాలేజీ మెట్లెక్కుతుందని కలలోగూడ అనుకోలేదు !

విధి ! సుదర్శన్ దృష్టి శాంతమీద పడింది ఇప్పుడు పూర్వపు శాంత కాదు- నూత్నజోత్స్నావిలసిత ! అందరికీ ప్రేక్టికల్ 5 నిమిషాలు బోధిస్తే- శాంతకి అరగంట చెప్పే వాడు సుదర్శన్ శాంత ఏవగించుకొనేది

శాంతని ఆనాడు తన గృహానికి ఆహ్వానించాడు నళినీకాంత్ శాంత లోకాన్ని చూసి భయపడినా అంగీకరించింది. నళినీకాంత్ గృహాన్ని చూసి శాంత ఆశ్చర్యపోయింది అతని వేషభాషలు- అందరిలో కలసి మెలసి తిరగడంచూస్తే అతను సామాన్య కుటుంబీకుడేమో అనుకుంది కానీ— నళినీకాంత్ ధనవంతుని ఏకైక బిడ్డడు- శాంత ఆదివ్య భవనములోనికి ప్రవేశింపడానికి సందేహించింది 'ఏమి' అన్నట్టు నళిని చూసాడు

"బీదవాళ్ళకు- ధనవంతులకు హస్తిమస్తికాంతరము తేడా వున్నది - నేను 'బీదదాన్ని రాలేను క్షమించాలి" అంది శాంత

"అవును తేడా వుంది" అన్నాడు నళిని శాంత ఆశ్చర్యపోయింది

"తేడావుంది- హృదయంలో- కాని లోపలికి రా" అన్నాడు నళిని

నళినీకాంత్ శాంతని తన గదిలోనికి తీసుకొనివెళ్లాడు గదంతా కళా నిలయంలా వుంది ఒక ప్రక్క పూర్తి కాని శిల్పాలున్నాయి. రెండవ ప్రక్కన చిత్రలేఖన

సామగ్రి యుంది బల్లపైని శిల్పాలు- గోడలకి చిత్రాలున్నాయి ప్రతీచిత్రం- ప్రతీశిల్పం ఒకటే తెల్పుతున్నాయి. అది "మానవత్వం"

"ఇదంతా మీ కళాసృష్టియేనా" అంది శాంత ఆశ్చర్యంగా

"అవును- నా సాంగత్యంవల్ల కళ కింకా చిన్నెలు, వన్నెలు తీర్చాలి శాంత"

"అయితే మీరు కళాకారులు కూడానా?"

"కళ నాగరికతకు ప్రథమసోపానం— నాగరికత అంటే సూట్లు వేసుకోడం కాదు- మేకప్ కాదు! విశాల హృదయంతో హయ్యర్ లెవిల్స్‌కు పోవడం"

"అబ్బా!" అంది ఏదో పట్టరాని ఆనందంతో శాంత

రోజులు దొల్లుతున్నాయి శాంతా నళినీకాంతుల హృదయసీమల్లో ప్రేమ వెల్లి పొర్లి పొంగుతున్నది అసలే శాంత సౌందర్యవతి నళినీకాంతుని కళాహస్తములలో ఆమె నూత్న ప్రభలతో వెలుగుతున్నది నళిని ఆమెను మోడల్‌గా చిత్రాలు గీస్తున్నాడు పత్రికలు అతన్ని శ్లాఘించాయి శాంత జీవిత ప్రాంగణంలో రంగవల్లికలు విరిసాయి

సుదర్శన్ కాలేజీలో శాంతను జూచి చిరునవ్వు నవ్వుతుండేవాడు శాంత ఏవగించుకొనేది సుదర్శన్ తన హృదయాన్ని శాంత కెరిగింప దలచాడు

శాంత యింటికి ప్యూను ఆనాడు వుత్తరం తెచ్చాడు శాంత విప్పి చూసింది సుదర్శనుని ప్రేమ లేఖ దానిని నేలకు విసిరి కొట్టింది.

కాలం దొర్లుతూంది సుదర్శన్ శాంతని వదలదలచ లేదు నయాన్ని కాకపోతే భయాన్నయినా లొంగదీయ దలచాడు

కొన్నిరోజులై శాంత కాలేజీలో కనబడటంలేదు సుదర్శన్‌కు ఆనాడు ఉత్తరం వచ్చింది- "శాంత" అని యుండడం చూసి ఆతృతగా విప్పాడు సుదర్శన్,

నమస్కారము- నీవు గొప్పవాడివి. నేను బీదదానిని మన యిద్దరికీ హస్తిమసికాంతరం తేడా యున్నదని ఆనాడు చెప్పేవు (సుదర్శనునకు ఆశ్చర్యం వేసింది 'ఎవరా శాంతని') విశాల హృదయుడే లోకంలో గొప్పవాడు! నాగరికుడవు నువ్వు, అజ్ఞానివి. ధన కరాళితో మానవ సమానత్వాన్ని తెగనరికావు! కట్నాలకాంక్షతో పేదగృహమేధుల్ని సమాధిచేయదలచావు! నీవు చదువుకున్న మూర్ఖుడివి! నీకు లోకజ్ఞానంలేదు! నీలాంటివాడ్ని పెళ్ళాడడం కంటే ఆత్మహత్య చేసుకుంటే మేలు! స్త్రీ ముందడుగు వేస్తే ఏ స్త్రీ సమస్య దుర్గమ దుర్గంకాదు! నేను ఎవరనుకున్నావు? నీకు తెలుసు!- నీవు పెండ్లికి తృణీకరించిన శాంతను!- శివరామదాసుగారి పుత్రికను. నీచేతులు కాలాయి నాకు పెళ్ళయిపోయింది నేను నళినీకాంతుని హృదయేశ్వరిని! జమీందారు శశిభూషన్ దాసుగారి ముద్దు కోడల్ని!

—శాంత

వణుకుతున్న అతని చేతులలో నుండి ఉత్తరం జారిపడింది